# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 221 | హైదరాబాద్ | మంగళవారం 24-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

తేజస్ 'క్రాష్' కాలేదు, చిన్న సాంకేతిక సమస్యే: హెచ్ఏఎల్ స్పష్టత

హైదరాబాద్ మెట్రో రైలుపై

## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం

- హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయం
- ఎల్ అండ్ టీతో సూత్రప్రాయంగా గత ఏడాది ఒప్పందం
- రూ.13 వేల కోట్ల రుణాలను బదలాయించుకోనున్న ప్రభుత్వం



11లో


11లో

## గచ్చిబౌలిలో రూ.1.76 లక్షలు పలికిన చదరపు గజం భూమి

- నగరంలోని పలు ప్రాంతాల్లో హౌసింగ్ బోర్డు భూముల వేలం
- కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాలులో 14 స్థలాల వేలం
- బాలాజీనగర్‌లో చదరపు గజం రూ.1.64 లక్షలు

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో

# చిరు జల్లులు

- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల వర్షా లు
- మధ్యాహ్నం వరకు ఎండ... ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం
- ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల్లో వర్షం



11లో

ఏపీలో ప్రారంభమైన

## ఇంటర్ పరీక్షలు..

- మొదటి రోజు ఫస్టియర్ విద్యార్థులకు పరీక్షలు
- మొత్తం 10.57 లక్షల మంది విద్యార్థుల హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు.. 144 సెక్షన్ అమలు
- ఈ ఏడాది నుంచి కొన్ని సబ్జెక్టులకు 32 పేజీల జవాబు పత్రం


11లో



తిరుమల లడ్డూ వివాదం..

## ఏపీ ప్రభుత్వానికి సుప్రీంలో భారీ ఊరట

11లో

- ఏకసభ్య కమిషన్ ఏర్పాటును సవాలు చేసిన సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ కొట్టివేత
- కమిటీ విచారణ కొనసాగించవచ్చని స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

శ్రీవారి లడ్డూ కల్తీపై పూర్తి వివరాలను

## రేపు అసెంబ్లీలో వెల్లడిస్తాం: నారా లోకేశ్



11లో

- శ్రీవారి లడ్డూ కల్తీకి సంబంధించిన వాస్తవాలను అసెంబ్లీ వేదికగా బయటపెడతామన్న నారా లోకేశ్
- ఆధారాలు సహా అన్నీ బయటపెడతామని వెల్లడి
- రాజకీయలబ్ధి కోసం దేవుడిని రోడ్డు మీదకు తీసుకువస్తున్నారని మండిపాటు


మృతులకు రూ. 10 లక్షల పరిహారం..

# కల్తీ పాల ఘటనపై అసెంబ్లీలో సీఎం ప్రకటన

- రాజమండ్రి కల్తీ పాల ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు
- మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఆర్థిక సాయం
- పాలలో కల్తీ తేలితే క్షమించేది లేదన్న సీఎం చంద్రబాబు
- ఆసుపత్రిలో 8 మందికి చికిత్స.. ఇద్దరి పరిస్థితి విషమం


11లో




11లో

ఏపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

## క్రికెట్ పోటీలు...

- రేపటి నుంచి మూడు రోజుల పాటు క్రీడా పోటీలు
- అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పోటీలు
- క్రికెట్ జట్టు కెప్టెన్లుగా నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్

# జరిమానా కాదు.. జాగ్రత్త ముఖ్యం: మల్కాజిగిరిలో 'హెల్మెట్ బ్యాంక్'

గోపాలపురం, ఫిబ్రవరి 23 (భారత శక్తి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారా? పొరపాటున హెల్మెట్ మర్చిపోయారా? ట్రాఫిక్ పోలీసులు ఆపగానే జరిమానా వేస్తారని కంగారు పడకండి. మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు మీ క్షేమం కోరి ఒక వినూత్న అడుగు వేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి చలానా వేయడమే కాకుండా, వారి ప్రాణ రక్షణ కోసం అక్కడికక్కడే హెల్మెట్‌ను ఇచ్చే

* **'హెల్మెట్ బ్యాంక్'*ను ప్రారంభించారు.**

**ఏమిటీ హెల్మెట్ బ్యాంక్?"**

మల్కాజిగిరి ట్రాఫిక్ డీసీపీ శ్రీ కె. రాహుల్ రెడ్డి, IPS ఆధ్వర్యంలో ఈ సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్ లేకుండా పట్టుబడిన వాహనదారులు తమ వివరాలను నమోదు చేసి, ఈ 'బ్యాంక్' నుండి ఉచితంగా హెల్మెట్‌ను







తీసుకోవచ్చు. అయితే, వారు 24 గంటల లోపు సొంతంగా కొత్త హెల్మెట్‌ను కొనుగోలు చేసి, పోలీసులు ఇచ్చిన హెల్మెట్‌ను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది.

**ముఖ్య ఉద్దేశాలు:**

ప్రాణ రక్షణ: తలకు గాయాలు కాకుండా తక్షణ జాగ్రత్తలు తీసుకోవడం.

మార్పు కోసమే: కేవలం జరిమానాలతో భయపెట్టడం కాకుండా, వాహనదారుల్లో బాధ్యతను పెంచడం.

స్నేహపూర్వక పోలీసింగ్: ప్రజల ప్రాణాల పట్ల పోలీసులకు ఉన్న నిబద్ధతను చాటిచెప్పడం.

**క్షేత్రస్థాయిలో అమలు:"**

ప్రస్తుతం ఈ వినూత్న కార్యక్రమాన్ని మల్కాజిగిరి జోన్‌లోని కీలక ప్రాంతాల్లో అమలు చేస్తున్నారు. ముఖ్యంగా గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగీత్ చౌరస్తా వద్ద ఈ విధానం అందుబాటులోకి వచ్చింది. తెలంగాణ పోలీసులు చేపట్టిన 'అరైవ్ అలైవ్' (Arrive Alive) రోడ్డు భద్రతా ప్రచారంలో భాగంగా ఈ చొరవ తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

"ప్రయాణం ఎంత దూరమైనా హెల్మెట్ ధరించడం ప్రాణావసరం. జరిమానాలు వేయడం మా లక్ష్యం కాదు, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరాలన్నదే మా తపన. వాహనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బాధ్యతగా మెలగాలి."

**— డీసీపీ ట్రాఫిక్, మల్కాజిగిరి.**



# 25న కార్మిక లోకం గర్జన

* **బిఎంఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త ఆందోళన**
* **సర్కారు తీరుపై కార్మికుల కన్నెర్ర**
* **కనీస పెన్షన్ రూ. 7,500 చేయాలని డిమాండ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (భారత శక్తి) : తమ సమస్యలను గాలికొదిలేసిన సర్కారు తీరును నిరసిస్తూ కార్మిక లోకం పోరాట బాట పట్టింది. ఈ నెల 25న దేశవ్యాప్తంగా 'ఆందోళన దినం' పాటించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) పిలుపునిచ్చింది. పూరిలో జరిగిన అఖిల భారత మహాసభల నిర్ణయం మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు బిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి వెల్లడించారు.

**వెట్టిచాకిరీ తప్పట్లేదు..**

ఐదు దశాబ్దాలుగా సేవ చేస్తున్నా అంగన్‌వాడీలను నేటికీ 'స్కీమ్ కార్మికులు'గానే చూడటం దారుణమని బిఎంఎస్ మండిపడింది. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు చాలీచాలని వేతనాలిస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ (NTC) కార్మికులకు 10 నెలలుగా, హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు 32 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంది.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

* పెన్షన్ పెంపు: EPS95 కింద కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 7,500కు పెంచి, ద్రవ్యోల్బణ భత్యం (DR) కల్పించాలి.
* నియామకాలు: ఉద్యోగ నియామకాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి, కొత్త పోస్టులను భర్తీ చేయాలి.
* క్రమబద్ధీకరణ: కాంట్రాక్ట్, స్కీమ్ కార్మికులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి.
* సదుపాయాలు: బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని విధానాన్ని అమలు చేయడంతో పాటు, ESI, EPF పరిమితులను పెంచాలి.

ఈ సమస్యలపై 25న నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలని, ప్రధాని, ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు అందజేయాలని బిఎంఎస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో S. మల్లేశం అఖిల భారత ఉపాధ్యక్షులు T. రామిరెడ్డి తెలంగాణ BMS ప్రధాన కార్యదర్శి యం. రాధాకృష్ణ హైదరాబాద్ జిల్లా BMS అధ్యక్షులు V. రమేష్ BMS రాష్ట్ర కార్యదర్శి T. కృష్ణ GHMC యూనియన్ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నేతల అరెస్టు అప్రజాస్వామికం: జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 23 (భారత శక్తి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు తో పాటు పలువురు నాయకులను పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం, నిర్బంధించడం అప్రజాస్వామికమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు కట్టుకొని సోమవారం మౌన నిరసన తెలిపారు. కామారెడ్డి ఘటనను సాకుగా చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి ఎదుగుదలను ఓర్వలేక అక్రమ అరెస్టులు కేసులు బనాయిస్తూ అణచివేయాలని చూస్తోందని విమర్శించారు. పోలీసులను ఉసికొలుపుతూ చట్టాన్ని చేతిలోకి తీసుకొని బెదిరింపులకు పాల్పడితే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. బిజెపి తిరగబడితే పరిస్థితి




వేరే తీరుగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరిపోయే దీపం వంటిదని ఎన్నో రాష్ట్రాలలో ఓడిపోయి చతికలబడిపోయినప్పటికీ రాష్ట్రంలో బరితెగించి వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా మండల నాయకులు పొదిల నరసింహారెడ్డి, సందీప్, వెంకటేశ్వర్లు కుల్ల వెంకన్న, మునిగంటి యాకయ్య, భోగ అనిల్, వల్లముల రాజేందర్, గండి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# పి జి ఆర్ ఎస్ లో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షేత్ర స్థాయి లో క్షుణ్ణంగా పరిశీలించిపరిష్కరించండి

**: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**

వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 23 (భారత శక్తి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీలను అధికారుల క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.. సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ సమావేశపు మందిరం నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని, ఇందుకు అనుగుణంగా అధికారులు పనిచేయాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయి కి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలనిఅర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ మెంట్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగాపరిశీలించాలన్నారు. పిజిఆర్ఎస్ లోరీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు వారికి అందిన




అర్జీల పరిష్కారానికి సమయం కేటాయించి సమీక్షా చేయాలన్నారు. అర్జీల పరిష్కారం లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

* **ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు**

1) పెద్దముడియం మండలం కొట్టాలపల్లె (నెమళ్ళదిన్నె) గ్రామానికి చెందిన చిన్నిగాల్ల రామాంజనమ్మ నాకు చెవుడు, వెన్నముక నొప్పితో బాధపడుతున్నానని, నేను చాలా పేదరాలు నని, నాకు పింఛన్ మంజూరు చేయ వలసింది గా అర్జీని సమర్పించారు.

2) పోరుమామిళ్ల మండలం రంగసముద్రం కు చెందిన ఎస్.కె.మహమ్మద్ నూర్ ఏపీ హౌసింగ్ బోర్డు వారికి చెల్లించవలసిన పూర్తి పైకం చెల్లించినామని. కాని మాకు బద్వేల్ సబ్ రిజిస్ట్రార్ వారు మాకు రిజిస్టర్ చేయడం లేదు కావున విచారణ చేసి మాకు న్యాయం చేయమని అర్జీని సమర్పించారు.

3) కొండాపురం మండలం బొమ్మేపల్లె గ్రామానికి చెందిన వై.చిన్న పెద్దులు నాకు క్యాన్సర్ ఉన్నందున ఎలాంటి పనులు చేసుకోలేక పోతున్నానని, నాకు పింఛన్ మంజూరు చేయువలనని అర్జీని సమర్పించారు

4) మైదుకూరు మండలం మంగళ వీధికి చెందిన ఎస్. భాగ్య లక్ష్మి తనకు ఆరోగ్యం బాగోలేక పూర్తిగా మంచానికే పరిమితమైనాని ప్రస్తుతం నాకు రూ :4000/లు పింఛన్ వస్తున్నదని కావున ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన రూ. :15000/లు మంజూరు చేయుదురని కోరుతూ అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ, డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి, పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, కోఆపరేటివ్ శాఖ అధికారి వెంకటసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిలోఫర్, MNJ ఆసుపత్రుల వద్ద

# అన్నార్తుల ఆకలి తీర్చిన 'రెడీ టు సర్వ్'

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (భారత శక్తి): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులు, నిరుపేదల ఆకలి తీర్చేందుకు 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ మరోసారి ముందుకొచ్చింది. 'అమ్మ హెల్పింగ్ హ్యాండ్' సంస్థతో కలిసి నగరంలోని నిలోఫర్ మరియు ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రుల వద్ద ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**ఆపన్న హస్తం.. ఆకలి తీర్చే యజ్ఞం**

దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చి, సరైన భోజన వసతి లేక ఇబ్బంది పడుతున్న సుమారు 300 మందికి పైగా రోగుల బంధువులకు పోషక విలువలతో కూడిన భోజనాన్ని వడ్డించారు. ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని సేవలందించారు.

**ఆకలి లేని సమాజమే లక్ష్యం**

ఈ సందర్భంగా పెద్ది శంకర్ మాట్లాడుతూ.. సమాజంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదన్న ఉద్దేశంతో ప్రతి వారం క్రమం తప్పకుండా అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. "ఆకలి లేని సమాజాన్ని నిర్మించడమే మా లక్ష్యం. ఈ సేవా యజ్ఞంలో దాతలు, వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భాగస్వాములు కావాలి" అని



ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఫౌండేషన్ కోఆర్డినేటర్ ప్రకాష్ యాదవ్, బి.టి. నాయుడు, సినీ నటుడు విజయ్ భాస్కర్, పురుషోత్తం, ప్రశాంత్, బాలకృష్ణ, సైదులు తదితరులు పాల్గొని తమ వంతు సహకారాన్ని అందించారు.

# తెలంగాణ ఎడ్‌సెట్ 2026 నోటిఫికేషన్ విడుదల.. మే 12న పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (భారత శక్తి): తెలంగాణలో ప్రభుత్వ టీచర్ ఉద్యోగం చేయాలనుకునే అభ్యర్థులకు కీలక అప్‌డేట్ వచ్చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయి ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (TG EdCET 2026) షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ఎడ్‌సెట్ చైర్మన్ ప్రొఫెసర్ కే ప్రతాప్ రెడ్డి సోమవారం ఈ వివరాలను వెల్లడించారు.

**ముఖ్యమైన తేదీలు ఇవే**

బీఈడీ (B.Ed) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ ఫిబ్రవరి




నుంచి ప్రారంభం కానుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ఫిబ్రవరి 23, 2026 నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తుకు చివరి తేదీ (సాధారణ రుసుముతో) ఏప్రిల్ 15, 2026. పరీక్ష నిర్వహణ తేదీ మే 12, 2026 (రెండు సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో). ఫలితాల విడుదల తేదీ మే 30, 2026. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోలేని వారు కింద తెలిపిన విధంగా ఫైన్‌తో అప్లై చేసుకోవచ్చు.

రూ.250 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 22 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 27 వరకు, రూ.1000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 30 వరకు అవకాశం ఉంటుంది. ఈ ఏడాది కూడా పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు ఆన్‌లైన్ (CBT) విధానంలోనే రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి తెలిపారు. అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.